# తెలుగుప్రభ
మన భాష.. మన పత్రిక

వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

గురువారం 6-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial




## చిన్నారి కిడ్నాప్ .. సేఫ్

**మేడ్చల్, తెలుగుప్రభ(జూలై6):**

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని ఈడబ్ల్యుఎస్ కాలనీకి చెందిన భరత్, రాజేశ్వరి దంపతుల కుమార్తె నాలుగేళ్ల కృష్ణవేణి కనిపించకుండా పోయింది. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి ఎదురుగా ఉన్న దుకాణానికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుకాణం వద్దకు వచ్చిన సురేష్ అనే వ్యక్తి అపహరించి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గురువారం సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాలిక సురక్షితంగా ఉంది. బుధవారం రాత్రి నుంచి స్థానికంగా కలకలం రేపిన ఈ కిడ్నాప్ సుఖాంతం కావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

## లేటెస్ట్ న్యూస్




## థీమ్ పార్కు పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్, తెలుగుప్రభ(జూలై6):**

జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గోల్డెన్‌హైట్స్ కాలనీలో రూ.2.24 కోట్లలో నిర్మించనున్న థీమ్‌పార్కు పనులకు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్థానిక శాసనసభ్యుడు ప్రకాశ్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కమల వికాసమా.. విలాపమా?

బీజేపీ ఎన్నికల బాటలో అసంతృప్తి ముళ్లు

గడ్డుకాలమే నంటున్న రాజకీయ పరిశీలకులు

'సంఘ్' సేవకులు ఆమోదిస్తారా..?

**రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఐదు నెలల గడువు కూడా లేని తరుణంలో బీజేపీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీని బలోపేతం చేస్తాయా ? బలహీన పరుస్తాయా ? అంటే రెండో దానికే మొగ్గుచూపుతున్నారు రాజకీయ పరిశీలకులు.**

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై7):**

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఆ పదవి నుంచి తప్పించడంలో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు పని చేశాయని చెబుతున్నారు. అందుకు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రఘునందన్‌రావుల వ్యవహార శైలిని ప్రస్తావిస్తున్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడి పార్టీ అధ్యక్షున్ని మార్చిన బీజేపీ బలం ఏ పాటిదో అంచనా వేసుకోవచ్చునంటున్నారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో బీజేపీ కనీసం రెండోస్థానంలోనైనా ఉండవచ్చునని భావించిన వారి అంచనాలు పటాపంచలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు తగిన సమయమే లేని తరుణంలో పదవుల తేనెతుట్టను కదల్చడంతో ఆపార్టీకి జరిగేది నష్టమే తప్ప లాభం ఉండదంటున్నారు. అందుకు వారు చెబుతున్న కారణాలిలా ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఏదో కొంత 'దూరం'పయనించిన 'బండి'ని ఎన్నికల రంగం నుంచి తప్పించినంత మాత్రాన బలపడగలమనుకోవడం భ్రమే నంటున్నారు. బండి సంజయ్ మద్దతుదారులు, అనుచరులు కొత్త అధ్యక్షునికి సహకరిస్తారనేది అనుమానమే. విజయశాంతి వంటి వారు సైతం బండి తొలగింపు సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### బెదిరింపు రాజకీయాలతో..?

ఇక బెదిరింపు రాజకీయాలతో పదవులు దక్కించుకున్న ఈటల రాజేందర్, రాజగోపాల్‌రెడ్డిలను పార్టీలోని ఆరెస్సెస్ శ్రేణులు ఏమేరకు అనుసరిస్తాయని ప్రశ్నిస్తున్నారు. మరోమారు పార్టీ సారథ్యం అప్పగించడంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సైతం అసంతృప్తిగానే ఉన్నట్లు భావిస్తున్నారు. బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశానికి హాజరుకాకపోవడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. బండి సంజయ్‌కు పెద్ద బలమేమీ లేకున్నా, ఆయన వ్యవహారశైలి వంటివి పార్టీకి ఇబ్బందే అయినా ఎన్నికలకు స్వల్ప సమయంలో చేసిన ఈ మార్పులతో ఎలాంటి ప్రయోజనముండదని చెబుతున్నారు. బండి సంజయ్ నియమించిన పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల్ని కొత్త సారథి కిషన్‌రెడ్డి కొనసాగిస్తారా? లేక కొత్త టీమ్ ఏర్పాటు చేసుకుంటారా ? అన్నదీ తెలియదు. ఏది చేసినా పార్టీకి జరిగేది నష్టమే తప్ప లాభం కాదంటున్నారు. సొంతబలం గురించి గళమెత్తిన రఘునందన్‌రావుకు పార్టీపరంగా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఏమేరకు అంకిత భావంతో పనిచేయగలరో చెప్పలేని పరిస్థితి. ఇలా , ఏ రకంగా చూసినా బీజేపీ బలం తగ్గే పరిస్థితులే తప్ప పెరిగే అవకాశాల్లేవని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

## న్యూయార్క్‌లో మాజీ మేయర్ మానియా




### టైమ్ స్క్వేర్‌పై హ్యాపీ బర్త్‌డే డిస్‌ప్లే ఇష్యూ వైరల్

హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కు చెందిన ఓ ఇష్యూ ఇప్పుడు వైరల్ అవుతోంది. అమెరికా వాణిజ్య రాజధానిగా గుర్తింపు పొందిన న్యూయార్క్‌లో ని ప్రఖ్యాత టైమ్ స్క్వేర్ వద్ద ఆయన పేరు డిస్‌ప్లే కావడం చర్చనీయాంశం అవుతోంది. తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం అంటూ బొంతు అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయం ఏంటంటే.. ఈ నెల 5న రామ్మోహన్ పుట్టినరోజు సందర్భంగా 22 వేల చదరపు అడుగుల భారీ స్క్రీన్ పై న్యూయార్క్ టైమ్ స్కేర్ వద్ద ఆయన అనుచరుడు ముదిరెడ్డి శ్రావణ్ ప్రదర్శించారు. విశ్వనగరంలో హైదరాబాద్ అభివృద్ధిలో ఆయన కృషి ఎంతో ఉందని వెల్లడించారు. విశ్వ నగర మాజీ మేయర్ పేరు విశ్వ విఖ్యాత చెందిన న్యూయార్క్‌లో మార్మోగడం హాట్ టాపిక్ గా మారింది.



## ప్రధాని పర్యటన... ఏర్పాట్లు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై 6)**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. జులై 7,8 వ తేదీల్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన దాదాపు రూ.50 వేల కోట్ల ప్రాజెక్టులకు ఈ రాష్ట్రాల్లో శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు బీజేపీ శ్రేణులు ఏర్పాట్లలో బిజీ బిజీగా గడుపుతున్నారు. జులై 7న ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో పర్యటించనున్న ప్రధాని.. 8వ తేదిన తెలంగాణ, రాజస్థాన్‌లలో పర్యటించనున్నారు. అయితే తెలంగాణలోని వరంగల్ కాజీపేటలో రూ.500 కోట్లతో గూడ్స్ రైలు వ్యాగన్ల తయారీ కర్మాగారానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల దేశంలో వ్యాగన్ల తయారీ సామర్థ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని ప్రధాన మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ కర్మాగారం వల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు దగ్గర్లోని అనుబంధ యూనిట్లు కూడా ఏర్పాటు చేసేందుకు తోడ్పడుతుందని పీఎంఓ తెలిపింది. అలాగే దాదాపు రూ.5,550 కోట్ల విలువైన 176 కిలోమీటర్ల జాతీయ రహదారుల విస్తరణకు కూడా ప్రధాని పునాదిరాయి వేయనున్నారు.

# ఘోర ప్రమాదం..



## మెక్సికోలో 29 మంది మృతి

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై 6)**

దక్షిణ మెక్సికోలోని ఓక్సాకా రాష్ట్రం మాగ్డలీనా పెనాస్కో పట్టణ సమీపంలో ఓ బస్సు లోయలో పడి 29 మంది మృతి చెందారు. ఘటన స్థలంలో అక్కడికక్కడే 27 మంది మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మరణించారు. బస్సు మెక్సికో సిటీ నుంచి జరిగింది. బస్సు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో బస్సు అదుపుతప్పి లోయలో పడ్డట్లు ఓక్సాకా రాష్ట్ర అంతర్గత కార్యదర్శి జెసల్ రొమెరో పేర్కొన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఓక్సాకా స్టేట్ ప్రాసిక్యూటర్ బెర్నార్డో రోడ్రిగ్జ్ అలమిల్లా తెలిపారు. రాష్ట్ర గవర్నర్ సాల్మన్‌జారా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మెక్సికోలో ఇటీవల జరుగుతున్న వరుస ప్రమాదాలు స్థానికులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి.



## కాంగ్రెస్‌పై ఆదరణ తగ్గుతుంది : పొన్నాల

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై 6)**

ఓబీసీలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వకపోతే కాంగ్రెస్‌పై ఆదరణ తగ్గుతుందని టీపీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య అన్నారు. "బీసీలు ఇతర రాజకీయ పార్టీల్లో గెలుస్తున్నప్పుడు కాంగ్రెస్‌లో ఎందుకు గెలవరు? బీసీల్లో ఆ విశ్వాసాన్ని పార్టీ ఎందుకు కలిగించలేకపోతోంది? కాంగ్రెస్ అధినాయకత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఓబీసీలను కలుపుకొని ముందుకెళ్లే దిశలో పార్టీ ఆలోచన చేయాలి" అని ఆయన కోరారు.